
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
బుధవారం 11 డిసెంబరు 2024



న్యూస్ బాక్స్


ఉచిత దంత వైద్యశిబిరం

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. స్వాతి దంత వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 300 మంది విద్యార్థినులకు వైద్యులు ఎంబీఎస్ ఎస్ ప్రసాద్, నిహారిక దంత పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. దంతాల సంరక్షణ, ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి దాసరి కల్పన మాట్లాడారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతో పాటు మనిషికి అందానికి దోహద పడే దంతాలు కూడా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జీ ప్రిన్సిపల్ రాజేందర్, అధ్యాపకులు సిహెచ్ సంపత్, శంకర్, రమేష్, అనురాధ, సంతో షి, ధనలక్ష్మి, రామకృష్ణ, నరేష్, ప్రశాంతి, లక్ష్మీ, కవి, వెంకటప్పయ్య, నాగరాణి, రఘు, సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సుల్తానాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మున్నూరు కాపు సంఘం కార్యదర్శి అమిరిశెట్టి అనిల్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. శిబిరంలో 120 మందికి ఈసీజీ, 2డి ఎకోతో పాటు బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గుర్రం కిరణ్, డాక్టర్ శ్రీనివాస్, కోట కరుణా కర్, బల్ల మనోహర్, బుర్ర సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

- పని ఒత్తిడిలో గ్రామ కార్యదర్శులు
- నిన్నటి వరకు సమగ్ర కుటుంబ సర్వే
- ఇందిరమ్మ యాప్‌లో అర్హుడా, కాదా అనే అంశాన్ని తొలగించాలంటున్న కార్యదర్శులు
- మరింత ఆలస్యం కానున్న లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ



'ఇందిరమ్మ' సర్వేకు దూరం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పని ఒత్తిడితో సతమతమవుతున్న పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేకు దూరంగా ఉన్నారు. సర్వేకు సంబంధించి తమకు రెమ్యూనరేషన్ ఇవ్వడంతో పాటు లబ్ధిదారుడు అర్హుడా, అనర్హుడా అనే కాలమును ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల యాప్ నుంచి తొలగించాలని పంచాయతీ కార్యదర్శులు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈనెల 7, 8 వ తేదీల్లో అక్కడక్కడా పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ యాప్ ద్వారా ఇంటింటికి వెళ్లి వారి స్థితిగతులను తెలుసుకున్నప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి పంచాయతీ కార్యదర్శుల సంఘాల ప్రతినిధులు సర్వేకు దూరంగా ఉండాలని సమాచార ఇవ్వడంతో జిల్లాలోనూ సర్వే నిలిచిపోయింది. దీంతో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ప్రక్రియ మరింత ఆలస్యం కానున్నది. గడిచిన బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై పెట్టుకున్న ఆశలు అడియాసలు అయ్యాయి. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల ద్వారా లబ్ధిదారులకు ఇల్లు మంజూరుచేస్తామని హామీ ఇచ్చింది. సొంత స్థలం ఉన్న వారికి ఇళ్ల మంజూరు చేస్తామని, ఇలాంటి ఇల్లు జాగ లేని వారికి 250 గజాల ప్రభుత్వ స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేస్తామని, తెలంగాణ రాష్ట్ర

మిగతా 8వ పేజీలో..

● ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలి..

ప్రభుత్వం జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలకు 10,500 ఇళ్లు మంజూరు చేసింది. ఈ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రతి గ్రామానికి, వార్డుకు ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను కూడా ప్రభుత్వం నియమించింది. ఈ పథకంలో అక్రమాలను గుర్తించేందుకు ప్రత్యేకంగా ఒక యాప్‌ను కూడా రూపొందించింది. ఈ యాప్‌లో ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ప్రభుత్వం నమోదు చేసింది. దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి వారి స్థితిగతులను సర్వే చేసి యాప్‌లో నమోదు చేయాలని గ్రామాల్లో సర్వే బాధ్యతలను కార్యదర్శులకు ప్రభుత్వం అప్పగించింది. గత నెల నుంచి తాము సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి మొదట ఇంటింటికి తిరిగి స్టికర్లను అంటించామని, ఆ తర్వాత ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహించామని, సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను పూర్తి చేశామని, ఎలాంటి సెలవులు వాడుకోకుండా పనిచేశామని కార్యదర్శులు పేర్కొంటున్నారు. అది ఇంకా అక్కడక్కడా పూర్తి కాకముందే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి మరోసారి అప్పగించడం వల్ల తమపై పని భారం పడుతుందని, అలాగే సర్వే యాప్‌లో లబ్ధిదారుడు అర్హుడా, కాదా అనే అంశాన్ని చేర్చడం తమకు ఇబ్బందిగా మారిందని, ఆ అంశాన్ని తొలగించాలని కార్యదర్శులు అంటున్నారు. అలాగే సర్వే చేసేందుకు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని కోరుతున్నారు. అర్హులైన లబ్ధిదాలని ఎంపిక చేసేందుకు ప్రభుత్వం యాప్‌ను పకడ్బందీగా రూపొందించింది. దరఖాస్తుదారుడి ఇంటి ముందు అతన్ని నిలబెట్టి ఒక ఫొటో, ఇంటి లోపల రూఫ్‌ను ఒక ఫోటో, ఇంటి లోపల పరిసరాలను కూడా ఒక ఫోటో తీయాలని, ఆ ఫోటోలను బట్టి ఆ ఇంటి యజమాని స్థితిగతులను తెలుసుకునేందుకు వీలుగా ఉంటుందని ప్రభుత్వం భావించింది. ఇదంతా చేయడానికి సమయం బాగా పడుతుందని, వారం రోజుల్లోగా పూర్తిచేయాలంటే సాధ్యం కాదని పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు. దీనిపై ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల సంఘాలతో మాట్లాడి చర్యలు తీసుకుంటే మళ్లీ ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభం కానున్నది.

అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు..

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లకు వంద శాతం నిరుపేదలనే ఎంపిక చేస్తామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అడ్లూరి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లకు మొదటి జాబితాలో నిరుపేదలను ఎంపిక చేయాలని సూచించారు. గ్రామపంచాయతీల్లో నిరుపేదలు ఎవరు ఉన్నారో, వారి ఇంటి స్థితిగతులు ఏంటో గ్రామకార్యదర్శులకే బాగా తెలుసని, నిరుపేదల జాబితా సిద్ధం చేసి పదిహేను రోజుల్లో అందజేయాలని తెలిపారు. ధర్మపురి నియోజకవర్గ వ్యాప్తంగా 3600ఇళ్లు కేటాయించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని, అందులో నుంచి మండలాల వారీగా ఆవశ్యకతను బట్టి లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. ఇల్లు కట్టుకునే స్థోమత లేని నిరుపేదలకు తానే ప్రత్యేక చొరవ తీసుకుని ఇల్లు కట్టి ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ ఆరిఫొద్దిన్, పంచాయతీరాజ్ డీఈ చంద్రమౌళి, ఎంపీవో రమేష్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ సీఎండీ పోస్టు భర్తీకి నోటిఫికేషన్

- వచ్చే ఏడాది జూలైతో ముగియనున్న పదవీ కాలం

జ్యోతినగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ) పోస్టు కోసం కేంద్ర ప్రభుత్వం మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్‌కు చెందిన పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలెక్షన్ బోర్డు ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 2025 ఆగస్టు 1 నుంచి సీఎండీ పోస్టు వెకెన్సీ ఉంటుందని పేర్కొన్నారు. షెడ్యూల్ ఎ పరిధిలోని ఎన్టీపీసీ సీఎండీకి నెలకు కనిష్ఠంగా 2 లక్షల రూపాయలు గరిష్ఠంగా 3.70 లక్షల రూపాయల వేతనం చెల్లిస్తారు. కాగా, ప్రస్తుతం ఎన్టీపీసీ సీఎండీగా పని చేస్తున్న గుర్‌దీప్ సింగ్ పదవీ కాలం 2025 జులై 31తో ముగియనున్నది. 2014లో కేంద్రంలో ఎన్‌డీఏ సర్కారు మొదటిసారి కొలువుతీరిన సమయంలో అదే ఏడాది గుర్‌దీప్ సింగ్‌ను ఎన్టీపీసీ సీఎండీగా నియమించారు. అప్పటి వరకు గుజరాత్ ఎలక్ట్రిసిటీ బోర్డు చీఫ్‌గా ఉన్న గుర్‌దీప్ సింగ్‌ను ప్రధాని మోదీ ఎన్టీపీసీ సీఎండీగా నియమించినట్లు ఆ సమయంలో ప్రచారం జరిగింది. గుర్‌దీప్ పదేళ్లపాటు సీఎండీగా కొనసాగుతున్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రదీప్ కుమార్

కాంగ్రెస్ అబద్ధపు హామీలతో ప్రజలు విసిగిపోయారు

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్

7



క్షీరాభిషేకం చేస్తున్న కోరుకంటి చందర్

తెలంగాణ తల్లి పేరుతో కాంగ్రెస్ కుట్రలు..

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

8

మంథని ఆర్టీసీ బస్ డిపోను సందర్శించిన ఆర్ఎం

మంథని, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంథని ఆర్టీసీ బస్సు డిపోను కరీంనగర్ ఆర్ఎం రాజు మంగళవారం సందర్శించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాజు డిపోను సందర్శించగా డీఎం శ్రావణ్‌కుమార్, ఉద్యోగులు స్వాగతం పలికారు. ఉద్యోగులు సమష్టిగా కష్టపడి డిపోను లాభాటాలోకి తీసుకురావాలని, అదనంగా డిపోకు బస్సుల సంఖ్య పెరిగేలా కృషి చేయాలన్నారు. మహాలక్ష్మి పథకంతో సంస్థకు ఆదాయం వస్తోందన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

సిమ్స్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్)లో మంగళవారంరాత్రి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ హిమబిందు హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో అన్ని పండుగలకు ప్రాముఖ్యం ఉందన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

గోదావరిఖని, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ పార్టీ రామగుండం నగర అధ్యక్షుడు బొంతల రాజేష్‌ను మంగళవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పరామర్శించారు. రాజేష్‌కు మెరుగైన చికిత్స అందించాలని ఆసుపత్రి వైద్యులకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు గౌస్ బాబా తదితరులు ఉన్నారు.

నీతినిజాయితీతో విధులు నిర్వహించాలి

- రామగుండం సీపీ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత చదువులు చదివి కష్టనష్టాలకోర్చి పోలీస్ ఉద్యోగాలు సాధించిన సిబ్బంది ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, నీతి నిజాయితీ, నిబద్ధతతో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా విధులు నిర్వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. అలాంటి వారికి పోలీస్‌శాఖలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. మంగళవారం కమిషనరేట్ సమావేశ మందిరంలో కొత్తగా విధుల్లో చేరిన ఏఆర్ కానిస్టేబుళ్లకు ఆయన దిశా నిర్దేశం చేశారు. పోలీస్‌శాఖలో మగ,ఆడ అనే తేడా ఉండదని, పోలీస్ ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్న ఉద్యోగమని, ఎప్పుడూ మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలన్నారు. అధికారులు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని, క్రమశిక్షణతో పని చేయాలన్నారు. విధి నిర్వ హణలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో అమలు చేయాలన్నారు. సాయుధ దళాల సిబ్బంది అన్ని రకాల విధులు నిర్వహించాల్సి వస్తుందని, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించినప్పుడు సమయానుకులంగా ఎలా వ్యవహరించాలనేది సీపీ వివరించారు. గార్డ్ డ్యూటీ, వీఐపీలకు, పీఎస్‌వోలకు విధులు, బీటీ టీమ్స్, బాంబు స్క్వాడ్స్, ఎస్కార్ట్ డ్యూటీలు, స్పెషల్ పార్టీ డ్యూటీలు, బందోబస్తు డ్యూటీలు చేసేటప్పుడు ఎలా ప్రవర్తించాలనే విషయాలను వివరించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సుందర్‌రావు, ఆర్ఐలు దామోదర్, వామనమూర్తి, శ్రీనివాస్, మల్లేషం, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

మంథని, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంథనికి చెందిన గట్టు నారాయణ గురూజీ రచించిన పుస్తకాన్ని గుజరాత్‌లోని అహ్మాబాద్‌లో ఆవిష్కరించారు. మంథనిలో నారాయణ గురూజీ శ్రీసీతారామ సేవా సదన్‌ను స్థాపించి సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పుస్తకావిష్కరణలో వక్తలతోపాటు రచయిత గట్టునారాయణ గురూజీ, మంథని శ్రీసీతారామ సేవా సదన్ అధ్యక్షుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు : సీపీ

కోల్‌సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సాధారణ పౌరులు, ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల, పెద్దపల్లి జోన్లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, డీజే, డ్రోన్‌ల వాడకంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నామన్నారు. చిన్నపిల్లలు వృద్ధులు రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా, శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు భారీ సౌండ్‌లతో కూడిన డీజే సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు విధించినట్లు తెలిపారు. వివిధ కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ వినియోగం తప్పనిసరి అని అనిపిస్తే సంబంధిత డివిజన్ ఏసీపీల అనుమతి పొందాలని సూచించారు. ఈ నిషేధాజ్ఞలు డిసెంబర్ 1నుంచి జనవరి 1 వరకు కొనసాగుతాయని తెలిపారు. పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాలం పరిమితి పొడిగించే అవకాశం ఉందని అన్నారు. బీఎన్ఎస్ 223, హైదరాబాద్ నగర పోలీసు చట్టం 1348 ఫసలీ నిబంధనలను అనుసరించి నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

థియేటర్ స్థలం స్వాధీన ప్రక్రియ పూర్తి

- నిర్మాణాల తొలగింపు.. - రూ.30కోట్ల స్థలం ప్రభుత్వపరం..



థియేటర్ స్థలంలో నిర్మాణాన్ని తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

కోల్‌సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఖని వ్యాపార కేంద్రమైన లక్ష్మీనగర్‌లోని పాత ఓల్డ్ అశోక థియేటర్ స్థలం స్వాధీనం దాదాపు పూర్తయ్యింది. జనగామ శివారు సర్వే నెం.683లో 35 గుంటల స్థలాన్ని ప్రభుత్వం సింగరేణి అవసరాలకు ఇచ్చింది. సింగరేణి ఈ స్థలాన్ని సినిమా థియేటర్ నిర్మాణానికి లీజుకు ఇచ్చింది. థియేటర్ మూత పడడం, లీజు గడువు పూర్తి కావడంతో థియేటర్ స్థలాన్ని తిరిగి అప్పగించాలని సింగరేణి ఒత్తిడి తెచ్చింది. రామగుండం ఎమ్మెల్యేగా రాజ్‌ఠాకూర్ గెలుపొందిన తరువాత ఈ స్థలం ప్రభుత్వపరం చేసేందుకు ప్రయత్నాలు తీవ్రతరం చేశారు. ఎట్టకేలకు ఇటీవల ఆ స్థలాన్ని సింగరేణి స్వాధీనం చేసుకుని రెవెన్యూకు అప్పగించింది. సుమారు రూ.30కోట్ల విలువైన ఈ స్థలం రెవెన్యూ ఆధీనంలోకి వెళ్లింది. ఈ స్థలంలో సుమారు 5గుంటల్లో నిర్మాణం ఉండడంతో దానిని తొలగించాలని రెవెన్యూ అధికారులు ఇటీవలే నోటీసులు ఇచ్చారు. మంగళవారం ఉదయం రెవెన్యూ అధికారులు ఆ నిర్మాణాన్ని తొలగించారు. దీంతో పాత థియేటర్ స్థలం పూర్తిగా ప్రభుత్వమయం అయ్యింది. నగరం నడిమధ్య ప్రభుత్వ అవసరాలకు 35గుంటల స్థలం అందుబాటులోకి వచ్చినట్లు అయ్యింది.

సమ్మె నోటీస్ అందజేత

జూలపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : తమ డిమాండ్ల సాధన కోసం మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రకటించారు. అనంతరం ఎంఈవో సరస్వతిని కలిసి సమ్మె నోటీసును అందజేశారు. సతీష్, తిరుమల, ప్రియాంక, మధ, అనిల్, వెంకటస్వామి, బాలయ్య, నవ్య, లక్ష్మి, మహేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ముత్తారం,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎలాంటి కోర్సు తీసుకుంటే భవిష్యత్ ఎలా ఉంటుంది అనే అంశాలపై ఐఐటీ మద్రాసు వారు చేపట్టిన ప్రాజెక్ట్ ఫ్రీ కేరీర్ గైడెన్స్ అండ్ సైన్స్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంను మండలంలోని దరియాపూర్ ఆదర్శ పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా తొమ్మిదో నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

క్రైం కార్నర్

దివ్యాంగురాలైన కూతురుని హత్య చేసిన తండ్రికి జీవిత ఖైదు

కరీంనగర్ లీగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగురాలైన కన్న కూతురుని హత్య చేసిన నేరంలో నిందితుడైన కసాయి తండ్రికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా జడ్జి బి ప్రతిమ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మానకొండూరు మండలం తీగల గుట్టపల్లికి చెందిన కొమిరె మహేందర్ (38)కి పెళ్లి కాగా కొన్నాళ్లకు ఆమె చనిపోవటంతో చంద్రపురి కాలనీకి చెందిన భావనను రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరికి పాప జన్మించింది. పాప జన్మించిన ఆరు నెలల సమయంలో ఆమెకు తీవ్ర జ్వరం రావడంతో నరాలు దెబ్బతిని కాళ్లు చేతులు పడిపోయాయి. ఆమెకు ఆరు సంవత్సరాల వయస్సు వచ్చినా అలాగే ఉంటున్నది. ఏపని చేయక తాగుడుకు అలవాటు పడిన కొమిరె మహేందర్ బిడ్డపై వ్యతిరేకత పెంచుకొని భార్యాబిడ్డలను తరచూ వేధిస్తుండేవాడు. అతని వేధింపులు భరించలేక భావన బిడ్డను ఇంటి వద్ద వదిలి వెళ్లిపోయింది. ఇదే అదనుగా భావించిన మహేందర్ 2023 మార్చి1న రాత్రి దివ్యాంగురాలైన బిడ్డను హత్య చేసి కెనాల్‌లో పడేశాడు. ఈ సంఘటనపై భావన ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు మహేందర్‌పై కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ విజ్ఞాన్‌రావు దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను ఎస్‌ఐ తిరుపతి కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి వెంకటేశ్వర్లు విచారించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జి ప్రతిమ నిందితుడికి జీవిత ఖైదుతో పాటు 1000 రూపాయల జరిమానా విధించారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూ తగాదాల్లో జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు మరొకరికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల జిల్లా కోర్టు తీర్పు వెలువరించినట్లు ఎస్పీ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్ గ్రామానికి చెందిన చెదలు రాజేందర్‌ను 2022 జనవరి 13న అదే గ్రామానికి చెందిన కాస సంజీవ్, గోధుర్ గ్రామానికి చెందిన ఖైదపల్లి రజనీకాంత్ వ్యవసాయ పొలంలో దారి విషయంలో గొడవకు దిగి రాజేందర్‌ను కత్తులతో పొడిచి హత్య చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. హత్య చేసిన కాస సంజీవ్ ఏ1, ఖైదపల్లి రజనీకాంత్ ఏ2, వీరికి సహకరించిన రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన మంగళరపు లక్ష్మీనారాయ ణను ఏ3గా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసుకు సంబంధించిన సరైన సాక్ష్యాలను పోలీసులు కోర్టులో ప్రవేశ పె ట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన జిల్లా అదనపు జడ్జి మంగ ళవారం తీర్పు వెల్లడించారు. నిందితులు కాస సంజీవ్, రజనీకాంత్ కు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి 10 వేల జరిమానా విధించినట్లు తె లిపారు. ఏ3 లక్ష్మీనారాయణకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, ఐదు వేల జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా అదనపు జడ్జి తీర్పు వెల్లడించారు.

బాలికపై అత్యాచారం

- పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

కోరుట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో ఓ యువకుడిపై పోలీసులు మంగళవారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని అలమయ్య గుట్టు ప్రాంతానికి చెందిన బాలిక(14)తో పాటు ఆమె తల్లి నివాసం ఉంటున్నారు. సదరు బాలిక తల్లి పలు ఇళ్లలో పని మనిషిగా చేస్తోంది. కూతురు ఇంటి వద్దనే ఉండడంతో కాలనీకి చెందిన యువకుడు ఇప్ప రవి సదరు బాలికతో పరిచయం పెంచుకున్నాడు. కొద్ది రోజులుగా బాలికను బెదిరింపులకు పాల్పడుతూ అత్యాచారానికి పాల్పడుతున్నాడు. మంగళవారం విషయాన్ని బాలిక తన తల్లికి చెప్పడంతో ఇద్దరు కలిసి రవి ఇంటికి వెళ్లి నిలదీయడంతో వారిపై రవి దాడి చేసాడు. దీంతో సదరు మహిళ స్థానికుల సహాయంతో పోలీసు స్టేషన్‌కు చేరుకోని తన కూతురుపై జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసింది. విషయంపై కోరుట్ల సీఐ సురేష్ బాబు ప్రాథమిక విచారణ జరిపి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం బాలికకు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రానికి తరలించారు. ఈ విషయంలో మెట్‌పల్లి డీఎస్పీ రాములు కోరుట్ల పోలీసు స్టేషన్‌లో విచారణ జరిపినట్లు సమాచారం.

ఎల్లమ్మ ఆలయాన్ని ఎండోమెంట్‌లో కలపొద్దు



దర్శన టికెట్లను పరిశీలిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయాన్ని ఎండోమెంట్‌లో కలపొద్దని గ్రామస్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. మంగళవారం దేవాదాయశాఖ కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ ఆలయాన్ని సందర్శించి దేవాదాయ శాఖలోకి విలీనం చేసుకుని ఈవో కాంతారెడ్డికి బాధ్యతలను అప్పగించారు. దీంతో విషయం తెలుసుకున్న గ్రామస్థు లు అక్కడకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఆలయ పరిస రాల్లో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎళ్ల నుంచి ఆలయానికి సేవలు చేస్తూ ఆధారిపడిన వారి కుటుంబాలు రోడ్డున పడతాయని మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లి విలీనం ఆపాలని కోరారు. నిర్వాహకులకు దరఖాస్తులు చేసుకుంటే పరిశీలించి న్యాయం చేస్తామని అసిస్టెంట్ కమిషనర్ వారికి తెలిపారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలోని వ్యాపారస్థులతో మాట్లాడి టికెట్ చార్జీలను తెలుసుకున్నారు. ఆలయానికి లక్షల్లో ఆదాయం వచ్చినా భక్తులకు ఎలాంటి ఏర్పాట్లు చేయడంలేదని రెండేళ్ల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీంతో దేవాదాయశాఖ అధికారులు విచారణ చేపట్టి ఆలయాన్ని విలీనం చేసిందన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగ కుండా ఆలయం వద్ద బందోస్తు ఏర్పాటు చేయాలని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డిని ఆమె కోరారు. దేవాదాయశాఖ అధికారులు, పోలీసుసిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ

శంకరపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం అర్కండ్ల గ్రామంలోని నేదురు ఐలమ్మ ఇంటి తాళం పగలగొట్టి రూ. 74వేల నగదు, బంగారు గొలుసులు చోరీకి గురైన సంఘటన వెలుగు చూసింది. నేదురు ఐలమ్మ సోమవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి గద్రెపల్లికు వెళ్లింది. మంగళవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోనే వస్తువులు చిందరవందర పడి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లిచూడగా రెండు తులాల బంగారు గొలుసులు, రూ. 74వేల నగదు దొంగిలించినట్లు తెలిపారు. గ్రామంలోని ఓ కుటుంబం ఇంటి తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారని కేశవపట్నం పోలీసులకు బాధితురాలు ఐలమ్మ ఫిర్యాదు చేసింది.

కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలోని కొత్తపల్లి రాజేశ్వరి తన ఇంటికి తాళం వేసి కథలాపూర్ మండలంలోని పోసానిపేట గ్రామానికి వెళ్లింది. మంగళవారం ఉదయంలో ఇంటికి తిరిగి వచ్చిన రాజేశ్వరి తన ఇంటి తాళం పగలగొట్టి ఉండడాన్ని గుర్తించింది. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అదే ప్రాంతంలో ఉన్న సల్ల లక్ష్మణ్ ఇంటి తలుపులకు ఉన్న తాళం పగుల గొట్టి ఉండగా గమనించిన స్థానికులు లక్ష్మణ్‌కు సమాచారం అందించారు. లక్ష్మణ్ మూడునెలల నుంచి మెట్‌పల్లి పట్టణంలోని ఉంటున్నాడు. కొత్తపల్లి రాజేశ్వరి ఇంట్లో మూడు తులాల బంగారు ఆభరణాలతో పాటు ఐదువేల నగదు ఆపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. లక్ష్మణ్ ఇంట్లో ఎంతపోయిందో రాత్రి వరకు నిర్ధారణ కాలేదు. పోలీసులు ఫింగర్ ప్రింట్స్ ద్వారా వేలిముద్రలను నమోదు చేసి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ట్రాక్ ఇలా.. టెస్ట్ ఎలా..?

- అసంపూర్తిగా డ్రైవింగ్ టెస్టు ట్రాక్
- 2015 ప్రారంభమైనా పూర్తికాని పనులు
- ట్రాక్ లేక నామమాత్రంగా డ్రైవింగ్ పరీక్షలు



డ్రైవింగ్ టెస్టు ట్రాక్ కనిపించకుండా ఇరువైపుల పెరిగిన చెట్లు

తిమ్మాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సుమారు 14 ఎకరాల విస్తీర్ణంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీటీసీ కార్యాలయంతో పాటు జిల్లా రవాణా శాఖ కార్యాల యం ఉన్నది. ఇందులో 5 ఎకరాల విస్తీర్ణంలో 2015వ సంవత్సరంలో డ్రైవింగ్ ట్రాక్ నిర్మాణ పనులు ప్రారం భించారు. కొంత పనులు పూర్తయిన్పటికీ నిధులు మంజూరు కాకపోవడంతో డ్రైవింగ్ టెస్టు ట్రాక్ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ట్రాక్‌కు ఇరువైపులా పెద్ద చెట్లు, పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో నిండిపోయింది.



ముళ్లతో చిత్తడిగా ఉన్న ట్రాక్

డ్రైవింగ్ టెస్టుకు రకరకాల ట్రాక్‌లు

డ్రైవింగ్ టెస్టులో ఉత్తీర్ణత కావాలంటే ముందుగా వాహనం నడిపే వ్యక్తికి రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ఎలాంటి జాగ్రతలు తీసుకోవాలి. రోడ్డుపై ఎలాంటి హెచ్చరిక బోర్డులు, సూచికలు ఉంటాయి. అలాంటి సమయాల్లో ఏ విధంగా వాహనం నడపాలనేది ప్రతి వాహనదారుడు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి. ఇందుకోసం డ్రైవింగ్ టెస్టుకు రకరకాల ట్రాక్‌లు ఏర్పాటు చేస్తారు. కారు, ద్విచక్ర, భారీ వాహనాలు నడిపే వారికి వేరువేరుగా ట్రాక్‌లు ఏర్పాటు చేస్తారు. 8 ట్రాక్ బాగా మలుపులు ఉన్న రోడ్లపై ఎలా ముందు వెళుతున్నామో తెలుస్తుంది. హెచ్‌ట్రాక్ ద్వారా వాహనం ముందుకు వెళ్లిన తరువాత రివర్స్ చేయాల్సి వచ్చినప్పుడు ఎలా తీసుకుంటున్నారో తెలుస్తుంది. ఎస్ ట్రాక్ ఒక మూల నుంచి మరో మూలకు మలుపు కోవాల్సి వచ్చినప్పుడు ట్రాక్ ద్వారా వాహనం నడిపే వారి నైపుణ్యం తెలిసిపోతుంది. ఎత్తుపల్లాల ట్రాక్ ద్వారా లోయలు, ఎత్తు పల్లాలు వంటి ప్రాంతాల్లో వాహనం ఎలా నడుపుతారో పరిశీలిస్తారు.

అమలు కాని నిబంధనలు :

మోటారు వాహన చట్టం నిబంధనలకు అనుగుణంగా డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లో నిర్దేశిత ప్రమాణా ల మేరకు వాహనం నడిపితేనే డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చే వారికి రవాణాశాఖ అధికారులు పరీక్ష నిర్వహించి అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి లైసెన్స్ మంజూరు చేస్తారు. ప్రస్తుతం డ్రైవింగ్ టెస్టు ట్రాక్ అందుబాటు లోకి రాకపోవడంతో నామమాత్రంగానే కార్యాలయం సమీపంలోనే ఖాళీ స్థలంలో బండ రాళ్లను ఏర్పాటు చేసి డ్రైవింగ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం టెస్టులు నిర్వహించక పోవడంతో డ్రైవింగ్ సరిగా రాకున్నా లైసెన్స్ ఇవ్వాల్సి వస్తుందనే విమర్శ లు ఉన్నాయి. ట్రాక్ వద్ద చెట్ల పొదలతో చిత్తడిగా మారింది. అధికారులు స్పందించి ట్రాక్ చుట్టూ ఉన్న చెట్ల పొదలు తొలగించి డ్రైవింగ్ టెస్టు ట్రాక్ పనులు పూర్తి చేయాలని వాహన దారులు కోరుతున్నారు.



బండరాళ్లను ఏర్పాటు చేసి టెస్టు చేయిస్తున్న అధికారులు



ఎత్తు పల్లాల ట్రాక్ వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు

డ్రైవింగ్ టెస్టులకు త్వరలో కొత్త టెక్నాలజీ

డీటీసీ పురుషోత్తం



ఆటోమెటిక్ టెస్టింగ్ సెంటర్లను అందుబాటులోకి తీసుకువస్తామని ప్రభుత్వం తెలిపింది. అప్పటి వరకు పాత పద్ధతిలోనే డ్రైవింగ్ టెస్టులు నిర్వహిస్తాం. ఆటో మెటిక్ టెస్టింగ్ సెంటర్లు ఎప్పుడు వచ్చేది పూర్తిగా తెలియదు. డ్రైవింగ్ టెస్టు ట్రాక్ నిర్మాణం ఎందుకు అగిపోయిందో తెలియదు. ప్రస్తుతానికి సీనియర్ ఇన్స్‌పెక్టర్ల పర్యవేక్షణలో డ్రైవింగ్ టెస్టులు పకడ్బందీగా నిర్వహిస్తున్నాం.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు



తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని స్కానింగ్ సెంటర్లలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వసంతరావు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ అంజలి ఆల్ఫ్రెడ్ జిల్లా కేంద్రంలోని అకస్మిక తనిఖీలను నిర్వహించారు. స్కానింగ్ సెంటర్లలోని స్కానింగ్ మిషన్లు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంజలి ఆల్ఫ్రెడ్ మాట్లాడారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్ నిబంధనాల ప్రకారం గర్భస్థ పూర్వ పిండ స్కానింగ్ పరీక్షలను నిర్వహించాలన్నారు. లింగ నిర్ధారణ చేసినట్లు రుజువైతే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం స్కానింగ్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. తనిఖీల్లో ఎన్జీవో చింతోజు భాస్కర్, లీగల్ అడ్వైజర్ శాంతి ప్రకాష్ శుక్ల పాల్గొన్నారు.

పోలీసుల వాహన తనిఖీలు.. తప్పించుకునే ప్రయత్నంలో రోడ్డు ప్రమాదం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలీసుల వాహన తనిఖీల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తి తన బైక్‌పై అతి వేగంగా వెళుతూ మరో వాహనాన్ని ఢీకొట్టిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ప్రమాదంలో మండల కేంద్రంలోని వ్యక్తి చరణ్‌తో పాటు మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిలో చరణ్ పరిస్థితి విషమంగా మారింది. క్షతగాత్రులను 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన చరణ్ తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వస్తున్నాడు. వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి భయంతో బైక్‌ను వెనక్కి తిప్పి అతి వేగంగా ముందుకు దూసుకెళ్లి మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దాంతో చరణ్‌తో పాటు మరో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. చరణ్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు నిర్ధారించారు. పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో రోడ్డు పక్క నుంచి ఒక్కసారిగా రోడ్డుపైకి రావడం వల్ల తప్పించుకునే ప్రయత్నంలోనే రోడ్డు ప్రమాదం చోటు చేసుకుందని ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటున్నారు.

జాతీయ బయోకెమిస్ట్రి సదస్సులో సిమ్స్ విద్యార్థుల ప్రతిభ

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(సిమ్స్) విద్యార్థుల పరిశోధన, నైపుణ్యంతో జాతీయ బయోకెమిస్ట్రి సదస్సులో నిర్వహించిన ప్రదర్శనలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తల ప్రశంసలు అందుకున్నారు. ఈ నెల 4 నుంచి 7వరకు చండీఘర్‌లో జరిగే 50వ జాతీయ బయో కెమిస్ట్రి సదస్సు ఏసీబీ ఐకాన్-2024 నుంచి గోదావరిఖని సింగరేణి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌కు చెందిన ఎంబీబీఎస్ రెండో సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. సాధారణంగా ఎండీ, పీహెచ్‌డీ స్థాయి విద్యార్థులు చేసే పరిశోధన ప్రదర్శనకు దీటుగా సిమ్స్ ఎంబీబీఎస్ రెండో సంవత్సరం విద్యార్థులు ప్రదర్శన చేయడంపై ఐఎఫ్‌సీసీ అధ్యక్షుడు, ఏసీబీ ఐకాన్-2024 అధ్యక్షుడు డాక్టర్ ఇందు వర్మ ప్రత్యేకంగా అభినందించారు. బయోకెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ అశోక్‌వర్ధన్ సారథ్యం లో పరిశోధన చేశారు. ఈ పరిశోధను జాతీయ సదస్సులో ప్రదర్శించారు. సాత్విక్, తిరూశి, అభిరామ్ రెడ్ టాక్సిసిటీ నాడీ వ్యవస్థ సంబంధిత సమస్యలపై బయోకెమిస్ట్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అశోకవర్ధన్ సహకారంతో పరిశోధన ప్రదర్శన నిర్వహించారు. సృజన, హర్షవర్ధన్, సందీప్ విటమిన్-డీ, శ్వాసకోశ సం బంధిత సమస్యలు, దాని ప్రభావం అంశంపై ప్రదర్శన నిర్వహించారు. అలాగే సాల్వాజీ రిషిరావు, గోషిక అన్ను న్యూరో బయోకెమిస్ట్రిలో మెదడు, జ్ఞాపకశక్తి అంశంపై ప్రదర్శన నిర్వహించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు, వైస్‌ప్రిన్సిపాల్, బయోకెమిస్ట్రి విభాగ అధిపతి డాక్టర్ నరేందర్ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందు

మద్యం మత్తులో ఆర్టీసీ బస్‌పై దాడి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం సేవించిన ప్రయాణికుడు ఆర్టీసీ బస్సుపై రాళ్లతో దాడికి పాల్పడ్డాడు. మంగళవారం గోదావరిఖని బస్టాండ్‌లో ఓడేడు వెళ్తున్న టీఎస్02 యూఏ 9885 బస్సులో కరీంనగర్‌కు చెందిన పంపరి శివకుమార్ ఎక్కాడు. తోటి ప్రయాణికులతో గొడవకు దిగిన శివకుమార్ కాలనీ షిర్కే బస్‌స్టాప్ వద్ద నడుస్తున్న బస్ నుంచి దూకాడు. రాళ్లతో బస్ అద్దాలను ధ్వంసం చేశాడు. దాడి ఘటనపై డ్రైవర్ బొడ్డు కుమార్ గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

హ్యాండ్ బ్యాగ్ అప్పగింత

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) స్థానిక చందపల్లికి చెందిన గజరంగి పోశెట్టి తన భార్య పిల్లలతో బైక్‌పై ఈనెల 4న బందంపల్లికి వెళుతుడగా హ్యాండ్ బ్యాగ్ పడిపోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బ్యాగులో తులం చెవికమ్మలు, మాటీలు ఉన్నయని ఎస్సై లక్ష్మణ్‌రావుకు తెలిపాడు. కేసు నమోదు చేసుకున్న ఎస్సై విచారిస్తుండగా శాంతినగర్ పెట్రోల్ బంక్ దగ్గర్లో పంక్చర్ షాప్ నడుపుకునే ఎండీ అఫ్జల్ తనకు హ్యాండ్ బ్యాగ్ దొరికిందని పోలీసులకు అప్పగించాడు. పెద్దపల్లి ఏసీపీ సమక్షంలో బ్యాగ్‌లో ఆభరణాలతో బాధితులకు అప్పగించారు. నిజాయితీ చాటుకున్న అఫ్జల్‌ను ఏసీపీ కృష్ణ మంగళవారం సన్మానించారు.

23క్వింటాళ్ల బియ్యం పట్టివేత

జమ్మికుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామ శివారులోని బెండ బుడగజంగ కాలనిలో గల ఓ డేరాలో అక్రమంగా నిల్వ ఉంచిన 23.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం పోలీస్‌లు పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లోని మార్కండేయ కాలనీకి చెందిన చింతల రామస్వామి అక్రమంగా నిల్వ చేసినట్లు పోలీస్‌లు గుర్తించారు. ఈ మేరకు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, రామస్వామిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

తండ్రి, కూతురు అరెస్టు

చందుర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇల్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న సంఘటనలో తండ్రితోపాటు కూతురును అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన జాగిరి నర్సయ్య తనకు చెందిన ఇల్లును అతనికి తెలియకుండానే తన అన్న అయినా జాగిరి పర్శరాములు, కూతురు జాగిరి మానస, నేరెళ్ల రమేష్ కలిసి మానస పేరు మీద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ సంఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. కాగా జాగిరి పర్శరాములు, జాగిరి మానసలను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్ తరలించాగా, నేరెళ్ల రమేష్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

సింగరేణిలో మహిళా అధికారులు

- ఇప్పటి వరకు ఉద్యోగులుగానే పరిగణింపు
- ఇక నుంచి మైనింగ్‌లోనూ నియామకం
- మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్)లుగా విధుల్లో చేరిక



శ్రీరాంపూర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో నవశకం మొదలైంది. ఇప్పటి వరకు యాజమాన్యం మహిళా ఉద్యోగులకు అవకాశం కల్పించగా ఇక నుంచి మహిళా అధికారులు(మేనేజ్‌మెంట్ ట్రైనీ-మైనింగ్) సంస్థలో పనిచే సేందుకు అంతా సిద్ధమైంది. శ్రీరాంపూర్ ఏరియాకు 22 మంది ఎంటీ(మైనింగ్) అధికారులను కేటాయించగా, ఇందులో ముగ్గురు మహిళా అధికారులు ఉన్నారు. వారు సోమవారం విధుల్లో చేరారు.



మేనేజ్‌మెంట్ ట్రైనీ మైనింగ్ మహిళా అధికారులు

బ్రిటీష్ నాటి కాలంలో..

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని సింగరేణి గ్రామంలో (ప్రస్తుతం ఇల్లెందు) 1889లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైంది. అప్పట్లో గునపాలతో బొగ్గును తొలిచి పైకి తీసుకొచ్చేవారు. బొగ్గు ఉత్పత్తిలో మహిళలు, బాలబాలికలు పాలుపంచుకునేవారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చాక 1947లో మహిళలను భూగర్భంలో పనిచేయకుండా నిషేధం విధిస్తూ అప్పటి భారత ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. ఆ తరువాత అవసరాలకు అనుగుణంగా మహిళలు సైతం గనుల్లో దిగి పనులు చేయవచ్చని గత చట్టాన్ని సవరించారు. దీంతో వారికి అవకాశాలు ఏర్పడ్డాయి.

నేరుగా ఉద్యోగావకాశం..

ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల కోసం ఈ ఏడాది మే నెలలో సింగరేణి నోటిఫికేషన్ ఇచ్చింది. పరీక్ష రాసి మేనేజ్‌మెంట్ ట్రైనీ (మైనింగ్)గా 88 మంది ఉద్యోగాలు సాధించారు. ఇందులో 28 మంది మహిళలు ఉన్నారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో కొత్తగూడెం ఏరియాలో ఆరుగు రు, భూపాలపల్లి ఏరియాలో ఆరు గురు, ఆర్‌జీ-2 ఏరియాలో ఆరుగురు, ఆర్‌జీ-1 ఏరియాలో ఐదుగురు, శ్రీరాంపూర్ ఏరియాలో ముగ్గురు, మణుగూరు ఏరియాలో ఇద్దరు సోమవారం జాయిన్ అయ్యారు.

ఏడాది శిక్షణలోనే...


ఉద్యోగంలో చేరిన వారికి రెండు వారాల పాటు ఓరియెంటేషన్ ట్రైనింగ్ ఉంటుంది. మొదటి మూడు రోజులు రక్షణపై స్థానిక వృత్తి శిక్షణ కేంద్రాల్లో అవగాహన కల్పిస్తారు. దీంతో కలుపుకొని రెండు వారాల పాటు వివిధ విభాగాలపై అవగాహన, మరో రెండు వారాలు పని ప్రదేశాల్లో శిక్షణ ఉంటుంది. నూతన ట్రైనీలు నెలకోమారు తమ శిక్షణకు సంబంధించిన రిపోర్టును వీటీసీలలో సమర్పించాలి. ఆరు నెలలకు ఫేజ్-1, ఒక సంవత్సరానికి ఫేజ్-2 పరీక్షలు నిర్వహిస్తారు. ఆ తదుపరి వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తారు.

గతంలో కుటుంబ పెద్ద చనిపోతే..

సింగరేణిలో మహిళలకు గతంలో నేరుగా ఉద్యోగాలిచ్చే అవకాశం లేదు. కేవలం వారి కుటుంబ పెద్ద చనిపోతే ఉద్యోగం ఇచ్చేవారు. ఆ తరువాత 2018 నుంచి కారుణ్య విధానంలో నియామకాలు చేపడుతున్నారు. ఇప్పటి వరకు కంపెనీ వ్యాప్తంగా సుమారు 1530 మందికి పైగా మహిళలు పనిచేస్తున్నారు. కాగా కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగ అవకాశం పొందిన మహిళలు కార్యాలయాలు, విభాగాల్లో వివిధ పనులు చేస్తున్నారు. కానీ గనుల్లోకి దిగడం లేదు. గతేడాది జూన్ 24న అప్పటి వరకు ఉన్న సర్ఫేస్ పదం తొలగించి అండర్ గ్రౌండ్ అని సర్క్యులర్ జారీ చేయడంతో మహిళా ఉద్యోగులు అండర్‌గ్రౌండ్‌లోకి దిగక తప్పదా అని చర్చ జరిగింది. ఆ తరువాత ఆ విషయం మరుగున పడింది.

శిక్షణ పొందిన తరువాతే విధులు

కల్లూరి వెంకట రామారావు, మేనేజర్, శ్రీరాంపూర్ వీటీసీ



సింగరేణిలో ఎవరు నియామకమైనా ముందుగా వృత్తి శిక్షణ కేంద్రం (వీటీసీ) ద్వారా శిక్షణ పొందాల్సి ఉంటుంది. ఇక్కడ బొగ్గు గనులు, వృత్తి సంబంధిత పనులు, విధులు, నిబంధనలు, నియమాలు, రక్షణ, తదితర విషయాలపై థియరీ నేర్చుకుంటారు. అనంతరం వృత్తి సంబంధిత పనులను గనుల్లోకి వెళ్లి తెలుసుకుంటారు. నూతనంగా మైనింగ్ అధికారుల బ్యాచ్ రావడం అభినందనీయం.

కష్టాలు ఎదుర్కొని..



ఈమె పేరు మాడిశెట్టి సాయిప్రత్యూష. జగిత్యాల జిల్లా డబ్బు తిమ్మయ్యపల్లి గ్రామం. తండ్రి టైలర్‌గా పనిచేసేవాడు. సాయిప్రత్యూషకు నాలుగేళ్ల వయస్సున్నపుడే తండ్రి చనిపోయాడు. తల్లి రేణుక టైలరింగ్ పనిచేస్తూ ఆమెతో పాటు చెల్లెలు ప్రియాంకను చదివించింది. నాచుపల్లిలో పాఠశాల విద్యాభ్యాసం, కరీంనగర్‌లో ఇంటర్మీడియెట్, కొత్తగూడెంలో బీటెక్(మైనింగ్) చేసింది. ఆ తరువాత రాజస్థాన్‌లో శిక్షణ పొందింది. ఇటీవల సింగరేణి ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల కోసం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణురాలై ఉద్యోగం సాధించింది.

మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం..



ఈమె పుట్టపాక సుమ. జగిత్యాలవాసి. తండ్రి తిరుపతి కారు డ్రైవర్. తల్లి భాగ్యలక్ష్మి బీడీ కార్మికురాలు. సుమకు ఒక తమ్ముడు ఉన్నాడు. బీటెక్ చదువుతున్నాడు. జగిత్యాలలో ప్రాథమిక విద్యాభ్యాసం, ఇంటర్ పూర్తి చేసింది. అనంతరం జేఎన్‌టీయూలో బీటెక్ మైనింగ్ చదివింది. చదువు పూర్తికాగానే పరీక్ష రాసి మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్) గా ఉద్యోగం సాధించింది.

ఉన్నత విద్యావంతురాలు



పాపునూక లక్ష్మి సైతం జగిత్యాలవాసే. తండ్రి బుచ్చన్న స్థానికంగా ప్రైవేటుగా పనిచేస్తుండగా, తల్లి గృహిణి. ఇంకా ఇద్దరు చెల్లెల్లు ఉన్నారు. లక్ష్మి ఎస్ఎస్‌సీ, ఇంటర్ జగిత్యాలలో చదువగా, మంథని జేఎన్‌టీయూలో బీటెక్ మైనింగ్ పూర్తి చేసింది. అనంతరం చెన్నై నుంచి ఎంబీఏ చదివింది. ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్)గా ఉద్యోగం పొందింది.

కొండగట్టులో భక్తుల సందడి



కొండగట్టులో అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు

మల్యాల, డిశంబరు 10(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామిని సన్నిధానం మంగళవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో సందడిగా మారింది. కొండపైకి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే వందలాది వాహనాలు, కాలినడకన కొండపైకి చేరుకున్న భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ తదితరులు భక్తుల రద్దీని పర్యవేక్షించారు.

అంజన్నను దర్శించుకున్న ప్రముఖులు

మల్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయయ స్వామిని మంగళవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. సమాచార హక్కుచట్టం కమిషన్ మాజీ కమిషనర్ మాఢబూసి శ్రీధర్ కుటుంబ సమేతంగా అంజన్న సన్నిధిలో పూజలు నిర్వహించారు. అనంతరం దసరా సినిమా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నిర్మాత మూర్తి కూడా అంజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు అర్చకులు సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదిం చారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్ర శేఖర్‌తో పాటు వెల్మ సంఘం జిల్లా అధ్యక్షుడు అయిల్నేని సాగర్‌రావు, నూకపల్లి విండో చైర్మన్ బోయినిపల్లి మధుసూధన్‌రావు, హరిచరణ్‌రావు, సంపత్‌కుమార్ ఉన్నారు

● సమాచారం పొందడం పౌరుల హక్కు

ప్రభుత్వ కార్యాలయాలు తదితర సంస్థల నుంచి సమాచారం పొందడం ప్రతీ ఒక్కరి హక్కు అని సమాచార హక్కుచట్టం కమిషన్ మాజీ కమిషనర్ మాఢబూసి శ్రీధర్ తెలిపారు. కొండగట్టు అంజన్నను దర్శించుకున్న అనంతరం మాట్లాడుతూ ప్రజలు దేనినైనా తెలుసుకోవచ్చునని అందించడం సంస్థలు, కార్యాలయాల బాధ్యత అని తెలిపారు.



రూపు కోల్పోయిన పూలవనం



గదికి అడ్డంగా ఏర్పాటు చేసిన ఇసుక సంచులు

అశోక వనం

- కొండగట్టు అంజన్న పూలవనంపై శీతకన్ను
- ఎండిపోయిన మొక్కలు
- గుట్టల వరదనీటితో ఉనికి కోల్పోయిన పూలవనం

మల్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలోని అశోక వనంపై అధికారుల పర్యవేక్షణ లోపంతో ఉనికి కోల్పోతోంది. అందులోని పూలు, పండ్ల మొక్కలు, చెట్లు ఎండిపోయాయి. గతంలో నిత్యం ఇక్కడి నుంచే స్వామి పూజలకు ఆలయ అలంకారానికి పూలు, పండ్లు, మామిడి ఆకులు తీసుకు వచ్చేవారు.

కొండపై నుంచి జేఎన్‌టీయూ వెళ్లే మార్గంలో బొజ్జపోతన గుడి సమీపంలో గల స్వామి వారి రెండెకరాల భూమిలో నిత్య పూజలకోసం పదేళ్ల క్రితం అశోకవనం పేరిట పూలు, పండ్లతోటలను పెంచడం ప్రారంభించారు. ఇందులో దాదాపు 500వరకు మామిడి, దానిమ్మ, జామ, ఎలక్కాయ, ఉసిరితో పాటు గులాబి, తులసి తదితర అనేక మొక్కలను పెంచారు. వాటి పర్యవేక్షణకు దేవస్థానం సిబ్బంది ఒకరిని నియమించారు.

గత హరిత హారం కార్యక్రమంలో భాగంగా మరిన్ని మొక్కలు కూడా నాటారు. అయితే కొన్నాళ్లుగా దానిపై నిర్లక్ష్యం కొట్టొస్తోంది. పూలు,పండ్ల తోటలలో సస్యరక్షణ చర్యలు చేపడుతూ వాటి సంరక్షణ, పెంపునకు దేవస్థానం అధికారులు ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాల్సి ఉండగా దాన్ని పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. దేవస్థానం పారి శుధ్య సిబ్బందిచే కొన్నాళ్ల క్రితం వరకు అశోక వనంలో కలుపు తీయడం, మొక్కల సంరక్షణ చేసేవారు.

చర్యలు తీసుకుంటాం..: రామకృష్ణరావు, ఈవో

అశోకవనం సంరక్షణకు చర్యలు తీసుకుంటాం. మరిన్ని వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు కూడా నాటిస్తాం. మొక్కల పెంపుకు చేపడతాం. పూలు ఆలయానికి వినియోగించే విధంగా చర్యలు తీసుకుంటూ తరచూ పర్యవేక్షణకు అధికారులకు బాధ్యతలు అప్పగిస్తాం. పూలవనంను అద్భుతంగా తీర్చిదిద్దుతాం.

గుట్టల వరదతో కనుమరుగు

వర్షాకాలంలో కురిసిన వర్షాలకు గుట్టల నుంచి వచ్చిన వరదకు పూలవనం ఇసుక దిబ్బలతో నిండి రూపు కోల్పోయింది. సమీపం గుట్టల నుంచి వచ్చే నీరు వెళ్లడానికి గతంలో కాంటూరు కందకాలు, వాటి ముందు కాలువలు ఉండగా ఇటీవల కందకాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు పూడ్చివేశారు. దీంతో కాలువ కనుమరుగు అయిగుట్టల నీరంతా పల్లపు ప్రాంతంలో ఉన్న పూలవనంలోకి వరద వస్తోంది. దీంతో అక్కడ గల పూలవనం కొట్టుకు పోగా గదికి అడ్డంగా ఇసుక సంచులు వేశారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకుని తరచూ పర్యవేక్షిస్తూ అశోకవనం మరింత పెంపొందించాల్సిన అవసరం ఉంది.



డ్రిప్ పరికరాల వద్ద బయట నుంచి వస్తున్న నీరు

అంతరాష్ట్ర దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కోటేశ్వర్‌రావు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శాతవాహన కాలనీలో దొంగతనం కేసులో అంతరాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఓ ఇంటి తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడిన ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా మండపేట మండలం చెరువుగట్టు గ్రామానికి చెందిన కందుల సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు(50)ని మంగళవారం బైపాస్ రోడ్‌లోని గౌతమినగర్ వద్ద అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కరీంనగర్ ఒకటవ టౌణా సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. నవంబరు 23న శాతవాహన కాలనీలోని ఉప్పుగుండ్ల మురళీకృష్ణకు చెందిన ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని 20 గ్రాముల బంగారు ఆభరణాలు, 46 గ్రాముల వెండి ఆభరణాలు చోరీ చేశాడని సీఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారణ చేపట్టామన్నారు. మంగళవారం గౌతమినగర్ ప్రాంతంలో వాహనాల తనిఖీ చేపట్టగా సత్యనారాయణ అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుని వద్ద నుంచి చోరీకి గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జడ్జి ఆదేశాలతో సత్యనారాయణను రిమాండ్‌కు తరలించాలని తెలిపారు. నిందితుడిపై గతంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో 20కి పైగా కేసులు నమోదయ్యాయని, శిక్ష కూడా అనుభవించాడనిసీఐ తెలిపారు.

పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికి పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ జిల్లా ఉప సంచాలకులు ఎం.నాగిరేశ్వర్ తెలిపారు. పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల మంజూరు కోసం ఎస్సీ రెన్యూవల్, ఫ్రెష్ విద్యార్థులు కళాశాలలు తమ దరఖాస్తులను ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ తమ విద్యార్థులతో స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకునేలా శ్రద్ధ వహించాలని కోరారు.

గీతాజయంతి ఉత్సవాలు ప్రారంభం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో గీతా జయంతి ఉత్సవాలను ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా ప్రారంభించారు. మంగళవారం ఉదయం గీత జయంతి ఉత్సవాలను పురష్కరించుకుని ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారి అద్దాల మండపంలో స్వస్తి పుణ్యా హవచనం, మంటప ప్రవేశం స్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలను వేదమంత్రాలతో చేపట్టారు. ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు గీతా హోమం ఘనంగా నిర్వహించారు. సంస్కృత పాఠశాల విద్యార్థులతో భగవద్గీత పఠనం చేయించారు. సాయంత్రం నాలుగు గంటలకు ఆలయ అద్దాల మండపంలో శ్రీమద్భాగవతము దశమస్కంధ పురాణ ప్రవచనము చేశారు.

రాజన్నను దర్శించుకున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. రాజన్న ఆలయంలో స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వదించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

పుట్టుకతోనే హక్కులు సంక్రమిస్తాయి

జాతీయ సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్



మాట్లాడుతున్న మాఢబూసి శ్రీధర్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) మనిషి పుట్టుకతోనే హక్కులు సంక్రమిస్తాయని అవి ఎవరో ఇచ్చేవి కావని జాతీయ సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జతీయ మానవ హక్కుల సమాఖ్య జగిత్యాల ఆధ్వర్యంలో జగిత్యాలలో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాడభూషి శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడిగే హక్కు, ఆలోచించే హక్కు జీవించే హక్కు ఇవన్నీ ఎవరి ద్వారానో రాలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజ్యాంగం ద్వారా మనకు మరిన్ని హక్కులు సంక్రమించాయన్నారు.కార్యక్రమంలో తెలంగాణ మానవ హక్కుల సమాఖ్య ఫౌండర్, చైర్మన్ అయిల్నేని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు నక్క గంగారాం, ఉపాధ్యక్షులు సందీప్‌రావు, ఉత్తర తెలంగాణ ప్రాంత ప్రతినిధి ప్రశాంత్‌రావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అప్ప చిన్నారెడ్డి పాల్గొన్నారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

అక్రమ రవాణా అరికట్టాలని డిమాండ్

మానకొండూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటూర్ మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాపై రెండు రోజులుగా గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేస్తున్నారు. ప్రతి నిత్యం ఇసుకను అక్రమంగా తరలించడమే కాకుండా ఓవర్ లోడ్‌తో వెళ్లడంతో రోడ్లు అవుతున్నాయని, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని రెండు రోజులుగా పచ్చునూర్, ఊటూర్ గ్రామస్థులు, మండల కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టి లారీలను అడ్డుకున్నారు. ఊటూర్ క్వారీ నుంచి పెద్ద ఎత్తున ఓవర్ లోడ్‌తో ఇసుక అక్రమ రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని ఆయా గ్రామాల ప్రజలు ఇసకలారీలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు చేపట్టి ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మానకొండూర్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు మర్రి ఓదెలు, ఉపాధ్యక్షులు రామిడి తిరుమల్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బండెల మహేందర్, మండల యూత్ అధ్యక్షులు కోండ్ర సురేష్, ఎర్రోల్ల కవిత, కనకం అశోక్, రేమిడి శ్రీనివాస్‌రెడ్డి, రొంటాల లక్ష్మారెడ్డి రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



ఊటూర్-పచ్చునూర్ గ్రామాల మధ్య నిలిచిన ఇసుక లారీలు

క్రీడలతో మానసికోల్లాసం

భగత్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు, అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు మంగళవారం ముగిసాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో శారీరక ధృఢత్వం పెరుగుతుందన్నారు. బాలుర విభాగంలో కరీంనగర్ 1వ స్థానం, మహబూబ్ నగర్ 2వ స్థానం, ఖమ్మం 3వ స్థానం, బాలి కల విభాగంలో ఖమ్మం 1వ స్థానం, కరీంనగర్ 2వ స్థానం, హైదరాబాద్ 3వ స్థానంలో నిలిచాయి.



గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

న్యాక్ బృందం గిరిజన మహిళా డిగ్రీ కళాశాల సందర్శన

తంగళ్లపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని గిరిజన మహిళా డిగ్రీ కళాశాలను నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) బృందం మంగళవారం సందర్శించింది. బృందం సభ్యులు రెండు రోజుల పాటు కళాశాలలోని వివిధ విషయాలపై అధ్యయనం చేసినట్లు ప్రిన్సిపల్ రెహానా ఇఫత్ తెలిపారు. కళాశాలలో అందుతున్న సదుపాయాలు, బోధన పద్ధతులు, అవలంభిస్తున్న విధానాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయని అధ్యయనం చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాల ఆధారంగా గ్రేడ్ కేటాయించేందుకు నివేదికను షీల్డ్ కవర్‌లో బెంగళూరులోని నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ ప్రాంతీయ కార్యాలయానికి పంపించినట్లు ప్రిన్సిపల్ వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఐక్య, కోఆర్డినేటర్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



న్యాక్ బృందంతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు

కాంగ్రెస్ అబద్ధపు హామీలతో విసిగిపోయిన ప్రజలు

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్



బైక్ ర్యాలీ తీస్తున్న బీజేపీ శ్రేణులు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ అబద్ధపు హామీలతో ప్రజలు విసిగిపోయారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు అబద్ధాలు, 66 మోసాలు పేరుతో బీజేపీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెండా చౌరస్తాలో ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో ప్రదీప్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిగా నిర్వహిస్తున్న పాలనను ప్రజల ముందు ఎండగట్టేందుకు బీజేపీ ఉద్యమి స్తోందన్నారు. రానున్న కాలంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని అని స్పష్టం చేశారు. సమావేశంలో గోమాస శ్రీనివాస్, గొట్టిముక్కల సురేష్‌రెడ్డి, శిలారపు పర్వతాలు, కాసిపేట శివాజీ, లావణ్య, ఊశ్లే తిరుపతి, ఎర్రోళ్ల శ్రీకాంత్, తంగేడ రాజేశ్వర్‌రావు, అన్ని మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పెద్దపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి దుగ్యాల ప్రదీప్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమలో నాయకులు కూకట్ల నాగరాజు, గోమాస శ్రీనివాస్, గొట్టెముక్కుల సురేష్‌రెడ్డి, సోమారపు లావణ్య, సంధ్యారాణి, ఎస్ఎస్‌సీ వనజ, అశోక్‌రావు, రాజన్నపటేల్, కందునూరి కుమార్, పవన్, కుమార్‌రెడ్డి, వేగోళం శ్రీనివాస్, సదయ్య పాల్గొన్నారు.

రామగుండంలో మొదలైన 'ఇందిరమ్మ' సర్వే

- ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికకు పకడ్బందీ వెరిఫికేషన్
- జీపీఎస్ ఫొటోలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పరిశీలన



ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపిక వెరిఫికేషన్ నిర్వహిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది



కోల్‌సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. జీపీఎస్, ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్‌ను ఈ సర్వేలో ఉపయోగిస్తున్నారు. పేదల్లో నిరుపేదలకు మొదటి దశలో ఎంపిక చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం అందుకు తగ్గట్టుగానే ఇందిరమ్మ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను అప్‌లోడ్ చేసి ఉంచారు. ఈ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సిబ్బంది పరిశీలించి సర్వే చేస్తున్నారు. ఇందిరమ్మ యాప్‌లో వివరాల ఆధారంగా వెరిఫికేషన్ చేస్తున్నారు. యాప్‌లో పలు అంశాలను కీలకంగా పెట్టారు. ముఖ్యంగా గతంలో ఇందిరమ్మ లబ్ధిదారులు, రేషన్‌కార్డులు, దరఖాస్తుదారులకు స్థలం ఉందా అనే విషయాలను ఆరా తీస్తున్నారు.

ఫొటోలు అప్‌లోడ్..

ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి వెరిఫికేషన్‌లో ఈ సారి టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ముఖ్యంగా యాప్‌లో ప్రస్తుతం నివాసముంటున్న ఇల్లు సొంతమ, అద్దెనా, ఏ రకమైన కట్టడం అనే వివరాలను ఆరా తీస్తున్నారు.

ఇంటిబయట, పైకప్పు, లోపల జీపీఎస్‌తో అనుసంధానం చేసి ఫొటోలు తీస్తున్నారు. ఇల్లు రేకుల ఇల్లా, స్లాబా అనే విషయాలను పరిశీలిస్తున్నారు. ఇంటి స్థలం ఉంటే డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేస్తున్నారు. డాక్యుమెంట్లకు సంబంధించే 12రకాల ఆప్షన్లు ఇచ్చారు. సొంత స్థలం, ప్రభుత్వ స్థలం, ప్రభుత్వం నుంచి పట్టా తీసు కున్న స్థలం,రెగ్యులరైజ్ అయిన స్థలం, అసైన్డ్, గ్రామ కంఠం తదితర వివరాలను నమోదు చేస్తున్నారు. స్థలానికి సంబంధించి సేల్‌డీడ్‌లు, ఇతర వివరాలు తీసుకుంటున్నారు. ఒకవేళ నివాసముంటున్న ప్రాంతానికి స్థలం దగ్గరలోనే ఉంటే ఆ స్థలం వద్ద దర ఖాస్తుదారుల ఫొటోతో పాటు రేఖాంశాల వివరాలను పొందుపరుస్తున్నారు.

మూడు విడతల్లో నిధులు..

ఇందిరమ్మ పథకానికి అర్హులైన పేదలకు మొదటి దశలో నియోజకవర్గానికి 3500 మంజూరు చేస్తారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి మూడు విడుతల్లో రూ.5లక్షల చొప్పున నిధులు ఇస్తారు. నిర్మాణానికి సంబంధించి జీపీఎస్, ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్‌తో ఎప్పటికప్పుడు పరిశీలించారు. ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో పర్యవేక్షణ ఉంటుంది. రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో ఇందిరమ్మ పథకం అర్హుల ఎంపికకు సర్వే మొదలైంది. నగర పాలక సంస్థ పరిధిలో 50డివిజన్లు ఉండగా ఆయా డివిజన్ల బిల్ కలెక్టర్లు, సహాయకుల ఆధ్వర్యంలో మంగళవారం నుంచి సర్వే నిర్వహిస్తున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాల ఆధారంగా ఈ సర్వే చేస్తున్నారు. రామగుండం అర్బన్‌లో మొదటి రోజు జరిగిన సర్వేలో ఎక్కువ వరకు సింగరేణి కార్మిక కుటుంబాలు, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలు ఉన్నట్టు తెలుస్తుంది. కాగా 20ఏళ్ల క్రితం సింగరేణిలో గోల్డెన్ షేక్ హ్యాండ్, వీఆర్ఎస్‌లతో పదవీ విరమణ చేసిన వేలాది మంది కార్మిక కుటుంబాలు గూడు లేక ఇప్పటికీ అద్దె ఇండ్లలోనే ఉంటున్నారు.

పాత లబ్ధిదారులకు నో ఛాన్స్..

ఇందిరమ్మ పథకంలో గతంలో లబ్ధిదారులుగా ఉన్న వారికి అవకాశం ఇవ్వరు. దీంతో పాటు కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులు, పక్కా ఇండ్లు, ఖరీదైన స్థలాలు ఉన్న వారు, ఫోర్‌వీలర్స్ యజమానులకు అవకాశం ఉండదు. ఈ పథకం క్రింద అర్హులను గుర్తించి ఎంపిక చేశారు. ఈ ఎంపికలో ఎస్సీ, ఎస్టీలు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ప్రాధాన్య తనిస్తారు.

న్యూస్ బాక్స్

వ్యాధుల బారి నుంచి పశువులను రక్షించుకోవాలి

సుల్తానాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత చలికాలంలో పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల పశువైద్యాధికారి గడ్డం రఘుపతి రెడ్డి రైతులకు సూచించారు. ముఖ్యంగా గొంతువాపు వ్యాధి నల్ల జాతి పశువుల్లో ఎక్కువగా సోకుతుందని, పశువులకు గొంతు వద్ద ఉబ్బడంతో వాటికి ఊపిరితీసుకోవడం ఇబ్బందిగా ఉంటుందన్నారు. అదే విధంగా గాలికుంటు వ్యాధి సోకుతుందని, ఇతర వ్యాధులేమైనా సోకితే 9121213650 సెల్‌ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు. పిచ్చికుక్క కరిచిన పశువుల చికిత్సకు సుల్తానాబాద్ ఆసుపత్రిలో ఇరవై డోసులు అందుబాటులో ఉన్నాయన్నారు. గడ్డి విత్తనాలు కూడా పాడి రైతులు 75 శాతం రాయితీతో అందిస్తామన్నారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

సుల్తానాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : టాటా కంపెనీ నిర్వహించిన ఎస్సే కాంపీటీషన్ పోటీలలో సుల్తానాబాద్‌కు చెందిన ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. విద్యార్థులు ఎర్ర శ్రీనిత్య, రిషి వరుణ్, అన్విత, ప్రీతంరావు, విషిత శ్రీ, సాహిత్యలు పలు బహుమతులు అందుకున్నారు. స్కూల్ కరస్పాండెంట్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియలు వారిని అభినందించారు.

కౌశిక హరి జన్మదిన వేడుకలు

పాలకుర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ కేశోరాం ప్రధాన ద్వారం ఎదుట మంగళవారం వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కౌశిక హరి జన్మదిన దిన వేడుకలను నిర్వహించారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. యూనియన్ ప్రధానకార్యదర్శి మాదాసు శ్రీనివాస్, బత్తిని సతీష్ గౌడ్,పెద్దపెల్లి నాగరాజు,దాడి బాపు, వేల్పుల సంపత్, రామకృష్ణ పాల్గొన్నారు.

నియామకం..

ధర్మారం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ జిల్లా చైర్మన్‌గా ధర్మారం మండలం మేడారం గ్రామానికి చెందిన మిట్ట తిరుపతిని నియమించారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సోషల్ రాష్ట్ర చైర్మన్ కొప్పుల విజయ్ కుమార్ చేతుల మీదుగా మిట్ట తిరుపతి నియామక పత్రం అందుకున్నారు.

● ఓదెల డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లికి చెందిన సిరిసేటి రాహుల్ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షునిగా ఎంపిక అయ్యాడు. తన ఎన్నికకు కృషిచేసిన ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యం చోరీ

పాలకుర్తి,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని ఎల్కలపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో నుంచి ఎడెల్లి కిష్టస్వామి, మేకల గట్టమ్మ, గరిపెల్లి సురేష్, చిట్టబోయిన మల్లేష్,గర్రెపెల్లి రమేష్ అనే రైతులకు చెందిన సుమారు 20 క్వింటాళ్ల ధాన్యాన్ని సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు మంగళవారం తెలిపారు. ఆరుకాలం కష్టపడి పండించిన ధాన్యం చోరీకి గురి కావడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీల పట్టివేత

ముత్తారం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమ్మంపల్లి, జిల్లాలపల్లి మానేరు నుంచి అక్రమంగా లారీలలో తరలిస్తున్న ఇసుకను గ్రామస్థులు పట్టుకున్నారు. అనంతరం రెవెన్యూ అధికారులకు తెలుపగా వారు ఇసుక లారీల పత్రాలను పరిశీలించి సరిగ్గా లేకపోవడంతో మంథని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కళాశాల ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలు

- విద్యార్థులపై దుష్ప్రభావం చూపే ప్రమాదం.. - తల్లిదండ్రుల్లో ఆందోళన..



ఎమ్మార్వో కార్యాలయ పాత భవనం



గదుల్లో పడి ఉన్న కండోమ్ ప్యాకెట్లు

జూలపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జూలపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోగల పాత ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయం భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని మండల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయ భవనాలు ఖాళీగా ఉండడంతో కొంత కాలంగా ఆకతాయిలు వీటిని అడ్డాగా చేసుకుని అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. అంతేకాకుండా ఈ భవనాలను ఆనుకొని శ్రీరావులమల్లికార్జున స్వామి, భక్త మార్కండేయస్వామి ఆలయాలు ఉండడం మూలంగా వాటి పవిత్రతకు భంగం వాటిల్లుతోందని భక్తులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యాలయాల ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన పాడుబడిన ప్రభుత్వ కార్యాలయాల భవనాలకు జిల్లా ఉన్నతాధికారులు మరమ్మతులు చేయించి వాటిని వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు. తద్వారా విద్యార్థుల భవిశ్యత్‌ను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యాలయాలకు రక్షణ కరువు..

- కొప్పుల మహేష్, బీజేపీ మండల అధ్యక్షుడు



రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను, విద్యార్థులను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఎంతో పవిత్రంగా చూడాల్సిన విద్యాలయాలకు రక్షణ లేకుండాపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

తెలంగాణ తల్లి పేరుతో కాంగ్రెస్ కుట్రలు..



క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గోదావరిఖని, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి పేరుతో కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆరోపించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ కొత్త తెలంగాణ తల్లి పేరుతో కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని, ఒక ప్రాంత ప్రజల అస్తిత్వానికి చిహ్నంగా ఉండాల్సిన తల్లి రూపం దివ్యంగా భవ్యంగా భగవత్ స్వరూపంగా ఉండాలని, ప్రజలు చూడగానే చేతులెత్తి నమస్కరించుకునే విధంగా ఉండాలన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని అవమానించినందుకు ముఖ్యమంత్రిని, కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఎప్పటికీ క్షమించరన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కల్వచర్ల కృష్ణవేణి అయిత శివకుమార్, కుమ్మరి శ్రీనివాస్, కవిత సరోజిని, మూల విజయరెడ్డి, నాయకులు బొడ్డుపల్లి శ్రీనివాస్, చెలకలపల్లి శ్రీనివాస్, మేతుకు దేవరాజ్, నారాయణదాసు మారుతి, బొడ్డు రవీందర్, మేడి సదయ్య, పిల్లి రమేష్, సట్టు శ్రీనివాస్, ముద్దసాని సంధ్యారెడ్డి, తోకల రమేష్, ఇరుగురాళ్ల శ్రావణ్, కిరణ్‌జీ, బుర్ర వెంకటేష్, ఆవునూరి వెంకటేష్, కర్రావుల రామరాజు, వడ్లకొండ మహేందర్, గుర్రం పద్మ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

● మంథని (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత పెట్రోల్ పంపు సమీపంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏగోళపు శంకర్‌గౌడ్, ఎక్కేటి అనంతరెడ్డి, కావేటి సమ్మయ్య, దేవళ్ళ విజయ్‌కుమార్, గొబ్బూరి వంశీ, మంథని లక్ష్మణ్, రాజబాబు, లక్ష్మయ్యలు పాల్గొన్నారు.

● ధర్మారం (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద తెలంగాణ తల్లి చిత్రపటానికి, మేడారంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

● రామగిరి (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వ చర్లలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మ్యాదరవేని శారదకుమార్‌యాదవ్, బోంకూరి పోచం, జాపతి శేఖర్, రేండ్ల కుమార స్వామి, రేండ్ల అశోక్, మెట్టు కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శబరిమల యాత్రకు వెళ్ళే అయ్యప్ప భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని గోదావరిఖని డిపో మేనేజర్ నాగభూషణం పేర్కొన్నారు. అయ్యప్ప దర్శనం కోసం ఆర్టీసీ అద్దె ప్రాతిపదికన ప్రత్యేక సర్వీస్‌లను నడుపుతున్నట్టు ఆయన తెలిపారు. మంగళవారం అయ్యప్ప ఆలయంలో మాలధారులను కలిసి మాట్లాడారు. మండల పూజ, జ్యోతి దర్శనంకు గోదావరిఖని నుంచి నేరుగా శబరిమలకు రెండు మార్గాల్లో సర్వీస్‌లు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. గోదావరిఖని నుంచి శ్రీశైలం, మహానంది,భవాని, గురువాయర్, ఎరుమేని, పంబ, శబరిమల, పళని, మధురై, తిరుపతి, విజయవాడ ఒక మార్గం అని, గోదావరిఖని విజయవాడ, కాణిపాకం, భవాని, ఎరువేలి, మధురై, శ్రీరంగం, కంచి, కాణిపాకం, మహానంది, అలంపూర్ రూట్‌లో సూపర్ లగ్జరీ సర్వీస్ అంబుబాటులో ఉన్నట్టు తెలిపారు. సుశిక్షితులైన డ్రైవర్లతో సురక్షితంగా శబరిమల యాత్ర పూర్తి చేయనున్నట్టు తెలిపారు. బస్సు బుకింగ్ చేసుకునే అయ్యప్ప దీక్షాపరులు 9441335701, 9908138036, 7382847427 నంబర్‌లలో సంప్రదించాలని నాగభూషణం కోరారు.

సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

ముత్తారం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం సీఎం కప్ ఆటల పోటీలు ప్రారంభించారు. ఎంపీడీవో సురేష్ పోటీలను ప్రారంభించారు. రెండు రోజులు నిర్వహించే ఈ పోటీల్లో గెలుపొందిన వారు జిల్లా స్థాయికి ఎంపిక అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఓదెలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలను సక్రమంగా నిర్వహించాలి..

జూలపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహించే సీఎం కప్ క్రీడా పోటీలకు అనువైన మైదానాలను ఎంపికచేసి, సౌకర్యాలను సమకూర్చేందుకు కృషిచేయాలని ఎంపీడీవో పద్మజ అన్నారు. జూలపల్లిలో గురువారం నిర్వహించే మండలస్థాయి క్రీడాపోటీల ఏర్పాట్లపై మంగళవారం వ్యాయామ ఉపాధ్యాయుల తో ఎంపీడీవో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కాలే జీ ఆవరణలోని మైదానాన్ని పరిశీలించారు. మండల పంచాయతీ అధికారి అనిల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' సర్వేకు దూరం..

(5వ పేజీ తరువాయి)

సాధన కోసం ఉద్యమించిన తెలంగాణ ఉద్యమకారులకు 250గజాల స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టింది. పార్లమెంటు ఎన్నికలకు ముందు ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 చొప్పున కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వల్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిలిచిపోయింది. గత రెండు మాసాల నుంచి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను ఏయే వర్గాలకు మంజూరు చేయాలని విషయమై కసరత్తు చేసి ఒక యాప్‌ను కూడా రూపొందించింది. డిసెంబరు 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలన గ్రామ, పట్టణ సభల్లో యువ వికాసం మినహా ఆరు గ్యారంటీ పథకాలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అందులో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 1,88,514 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో సొంత ఇల్లు ఉండి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోసం 1,85,404 మంది, ఇంటి స్థలం లేక 250 గజాల స్థలంతో పాటు ఇల్లు మంజూరు కోసం 250 మంది, తెలంగాణ ఉద్యమకారులు 2707మంది దరఖాస్తు చేసుకున్నారు.

వ్యవసాయ బావుల విద్యుత్ బకాయిలు చెల్లించాలి

కమాన్‌పూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వ్యవసాయ బావుల, బోర్ల బకాయిల విద్యుత్ బకాయిలను చెల్లించాలని ఎన్‌పీడీసీఎల్ సబ్ స్టేషన్ ఏఈ నాల అశోక్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సంవత్సరానికి రూ. 365లు చెల్లించాలని కోరారు. నేరుగా సబ్‌స్టేషన్‌లో గానీ లేక గూగుల్ పే ద్వారా ఫోన్‌పే ద్వారా రైతులు విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం ఉంటుందని తెలిపారు. వెంటనే బిల్లులు చెల్లించి విద్యుత్తు సంస్థకు చేయూతనివ్వాలని కోరారు.

నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

కమాన్‌పూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువకులకు సోలార్ రంగంలో మూడు నెలలు ఉచిత నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగం అవకాశం కల్పిస్తున్నట్లు ఎల్లారెడ్డిగూడలోని అల్టిమేట్ ఎనర్జీ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కోఆర్డినేటర్ శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు ఐటీఐ, డిప్లొమా పాసై 18-35 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, 16వ తేదీ నుంచి బ్యాచ్ ప్రారంభమవుతుందని, వివరాలకు 7093711969, 7093991843 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

సీఎం చిత్రపటానికి హోంగార్డుల క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న హోంగార్డులు

కోల్‌సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : హోంగార్డుల రోజు వారీ వేతనం రూ.1000కి పెంచడంతో పాటు రూ.5లక్షల ప్రమాద ఎక్స్‌గ్రేషియా, వీక్లి పరేడ్ అలవెన్సు వంటి సౌకర్యాలు కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తు మంగళవారం రామగుండం పోలీస్ కమిషరేట్‌లోని హోంగార్డుల కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా హోంగార్డులు మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని 2025జనవరి నుంచి హోంగార్డులకు కూడా వర్తింప చేస్తామని హామి ఇచ్చారన్నారు. హోంగార్డుల బాధలు అర్థం చేసుకున్న తాము రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ మల్లేషం, పెద్దపల్లి జోన్ హోంగార్డ్స్ ఇన్‌చార్జి, హెడ్ కానిస్టేబుల్ మనోహర్, హోంగార్డ్స్ పీఎల్‌సీ సత్యనారాయణ, కుమార్, బ్రహ్మచారి, శ్రీనివాస్, నర్సయ్య, చంద్రమౌళి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క గ్యారంటీని కూడా నెరవేర్చలేదు..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఒక్కటి కూడా నెరవేర్చలేదని బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి పేర్కొన్నారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలకు, యువతకు, నిరుద్యోగులకు డిక్లరేషన్ల పేర హామీలు ఇచ్చారన్నారు. యువతకు నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ వంటి హామీలు ఇచ్చారని, మహిళలకు నెలకు 2500, కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, రైతులకు రుణమాఫీ, రైతుభరోసా హామీలు ఇచ్చి మరిచిపోయారన్నారు. అదేబాటలోనే రామగుండం ఎమ్మెల్యే నడుస్తున్నారన్నారు. నిరుద్యోగులకు జరిగిన అన్యాయంపై బుధవారం గోదావరిఖనిలో బైక్ ర్యాలీ చేసి చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపడుతామన్నారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో మేరుగు హన్మంతుగౌడ్, బీజేవైఎం నాయకుడు పిడుగు కృష్ణ, పట్టణ అధ్యక్షుడు రమేష్, మహేష్, రవీందర్ పాల్గొన్నారు.

నేటి నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

ధర్మారం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ధర్మారం మండలం నందిమేడారం బాలుర వసతి గృహంలో బుధ, గురువారాల్లో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. జూనియర్ , సీనియర్ విభాగాల్లో జరిగే ఈ పోటీల్లో 11వ, తేదిన బాలురకు 12వ, తేదిన బాలికలకు క్రీడా పోటీలు నిర్వహిస్తారు. పోటీల్లో పాల్గొనేవారు ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు. మిగతా వివరాలకు వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్ శ్రీనివాస్ ఫోన్ నంబర్ 9398295492, టి.సౌజన్య 9010635885 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆరీఫ్‌ఉద్దీన్, ఎంపీవో రమేష్, ఎంఈవో చాయదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి కల్పన

కోల్‌సిటీటౌన్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్య విద్యార్థి జీవితంలో కీలకమని, అందుకోసం వారి మంచి భవిష్యత్ కోసం ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి దాసరి కల్పన అన్నారు. మంగళవారం గోదావరిఖని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. నేటి రోజుల్లో మొబైల్ ఫోన్ల వాడకం విపరీతంగా పెరిగిందని, విద్యార్థులను మొబైల్స్ ఫోన్లకు వీలైనంత దూరంగా ఉండేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. మానసికంగా ఉల్లాసంగా ఉండేలా ఇంటి వద్ద వాతావరణాన్ని కల్పించాలని, రానున్న మూడు నెలలు కీలకమని, చదువుకు ఇబ్బంది కలగకుండా కళాశాలకు గైర్హాజరు కాకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ప్రిన్సిపల్ రాజేందర్, అధ్యాపకులు సిహెచ్ సంపత్, డి.శంకర్, రమేష్, అనురాధ, సంతోషి, ధనలక్ష్మి, రామకృష్ణ, నరేష్, ప్రశాంతి, లక్ష్మి, కవిత, వెంకటప్పయ్య, నాగరాణి, రఘు, సుమలత పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

క్రీడలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపు

- ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు



జ్యోతితో పరిగెత్తుతున్న ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు

రామగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్మికుల నైపుణ్యం పెరుగుదల కోసం సంస్థ క్రీడలకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తోందని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ రాణిరుద్రమాదేవి క్రీడా ప్రాంగణంలో పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే కంపెనీ స్థాయి అథ్లెటిక్స్, స్విమ్మింగ్, త్రోబాల్ పోటీలను మంగళవారం ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడా ప్రాంగణంలో స్పోర్ట్స్ జెండాను ఆవిష్కరించి కాగడాతో రన్‌ను నిర్వహించారు. ఈ పోటీల్లో బెల్లంపల్లి-మందమర్రి, శ్రీరాంపూర్, రామగుండం రీజియన్, భూపాల్‌పల్లి, మణుగూరు-ఇల్లెందు, కార్పొరేట్-కొత్తగూడెం రీజియన్ల నుంచి సుమా రు మూడు వందల మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో అధికారులు సంఘం అధ్యక్షుడు సీహెచ్ వెంకటరమణ, అధికారులు రఘుపతి, బండి నారాయణ, సుదర్శనం, కార్యదర్శి సునీల్‌ప్రసాద్, స్పోర్ట్స్ సిబ్బంది జాన్‌వెస్లీ, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీడీకే 11ఇంక్లైన్‌లో మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం లలిత్ కుమార్

గోదావరిఖని, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-1 జీడీకే 11 ఇంక్లైన్‌లో మంగళవారం ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ ఆధ్వర్యంలో మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్థ, మన గని, మన బాధ్యతలను వివరించే మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశంలో వివిధ అంశాల గురించి కమిటీ సభ్యులు తెలియజేస్తూ సీఎండీ బలరామ్ ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులపై నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తమవంతుగా ప్రతి ఒక్కరు వివిధ సలహాలు ఇవ్వడం ద్వారా. సంస్థపై అంకిత భావం, సమష్టి కృషితో నాణ్యత, ఉత్పత్తి, ఉత్పాదకతలు పెంచడానికి ఉపయోగపడుతుందన్నారు. మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సభ్యులు వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణిలోని గనులు, వాటి పనితీరు గురించి వివరించారు. ఉత్పత్తి ఉత్పాదకత, బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్ తరలింపు, నెలల వారిగా నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించడానికి ప్రణాళికల గురించి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆర్జీ-1 ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి పెంపునకు తీసుకోవలసిన ప్రణాళికల గురించి వివరించారు. ఎంటూ జీఎం గోపాల్ సింగ్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోషం, ఏరియా ఇంజనీర్ డీవీరావు, ఐఈడీ ఎజీఎం ఆంజనేయులు, ఏజెంట్ చిలుక శ్రీనివాస్, డీజీఎం(పర్సనల్) కిరణ్ బాబు, ఫైనాన్స్ డీజీఎం ధనలక్ష్మిబాయి, మేనేజర్ కోలా మల్లేశం పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించాలి



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్జీ-2 జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందచాలని ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య అన్నారు. మంగళవారం ఓసీపీ-3 సీహెచ్‌పీలో మల్టీడిపార్ట్‌మెంటల్ బృందం పర్యటించింది. ఈసందర్భంగా 2024-25 వార్షిక సంవత్సరంలో సింగరేణి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, రానున్న ఆర్థిక సంవత్సర లక్ష్యం, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, సింగరేణి భవిష్యత్తు ప్రణాళికలు, సవాళ్ళు, లక్ష సాధనకు అనుసరించాల్సిన విధానాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సంబంధిత అధికారులు ఉద్యోగులకు వివరించారు. సీహెచ్‌పీలో బొగ్గు నాణ్యతా ప్రమాణాలు పాటించడం సింగరేణికి అత్యంత కీలకమని తెలిపారు. పోటీ మార్కెట్‌లో వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు సకాలంలో సరఫరా చేయడం ద్వారా సింగరేణి మార్కెట్ నిలబడుతుందని అన్నారు. క్వారీ నుంచి వచ్చే బొగ్గులో మట్టి, బండలు తొలగించి, నాణ్యత పెంచేలా ఉద్యోగులు కృషి చేయాలని జీఎం వెంకటయ్య సూచించారు. బొగ్గు నాణ్యత పెంపుదలకు ఉద్యోగుల నుండి సూచనలు తీసుకున్నారు. అనంతరం ఉద్యోగులతో అధికారులు రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, మల్టీడిపార్ట్‌మెంట్ టీంసభ్యులు నరసింహారావు, రాముడు, అనిల్‌కుమార్, మురళీకృష్ణ, తిరుపతిరెడ్డి, సీహెచ్‌పీ ఇంచార్జి సదానందం, ఎస్ఎస్ఓ షరీఫ్, పిట్ సెక్రెటరీ సెగ్గెం శంకర్ పాల్గొన్నారు.

మున్సిపల్ జంక్షన్‌లోని రాములు స్థూపాన్ని కూల్చొద్దు

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐ కృష్ణ

గోదావరిఖని, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మున్సిపల్ జంక్షన్‌లోని యా రాములు స్థూపాన్ని కూల్చివేయవద్దని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీడిత, కార్మికవర్గ పోరాటాల్లో ముందున్న రాములు 2004లో అత్యంత దారుణంగా హత్యకు గురయ్యారన్నారు. అతని స్మారకార్థం మున్సిపల్ జంక్షన్ వద్ద స్మారక స్థూపం నిర్మించామన్నారు. ప్రస్తుతం మెడికల్ కళాశాల జంక్షన్ అభివృద్ధి పేరిట దానిని తొలగిస్తామని అదనపుకలెక్టర్ చెప్పారని, తాము ప్రత్యామ్నాయ స్థలంలో నిర్మించి ఇవ్వాలని కోరామన్నారు. దీనికి వారి వైపు నుంచి సానుకూల స్పందన లేదని, బలవంతంగా తొలగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు అశోక్, చంద్రయ్య, మల్లేష్, కొమురయ్య, తిరుపతి, రాజేశం, ఎడ్ల రవి పాల్గొన్నారు.

14 నుంచి మానవ హక్కుల వేదిక సభలు

ఓదెల డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అనంతపూర్‌లో ఈనెల 14,15 తేదీల్లో నిర్వహించనున్న మానవ హక్కుల వేదిక సభలను విజయవంతం చేయాలని మానవ జిల్లా కన్వీనర్ భువనగిరి రాజు కోరారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో రాజు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు, విద్యావంతులు, మేధావులు ఈ సభలకు హాజరుకావాలని కోరారు.

ఆశా వర్కర్ల గౌరవ వేతనం పెంచాలి

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆశాకార్యకర్తల గౌరవ వేతనం 18వేల రూపాయలు అందించాలని ఆశా వర్కర్ల మండల అధ్యక్షురాలు తాండ్ర శారద డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని 'చలో అసెంబ్లీ'కి తరలి వెళ్తున్న ఆశా వర్కర్లను పోలీసులు అరెస్టుచేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్ల మండల అధ్యక్షురాలు తాండ్ర శారద, సునీత, భూలక్ష్మి, సరోజన, మౌనిక, స్వరూప, మమత, వరలక్ష్మి తదితరులు ఉన్నారు.